తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల
కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం
30 జూన్ 2026
పేజీలు : 8
Follow :



# 10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్

## నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా 46వ డివిజన్ పరిధిలోని రామ్‌నగర్, రోడ్ నెం.6లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగరంలో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపడు తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రామ్‌నగర్ ప్రాంతంలో ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత మురుగునీటి పారుదల సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని, స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగు తుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున రాజేం దర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వాన కురిసే.. రైతు మురిసే

## ఖరీఫ్‌కు అనుకూలంగా భారీ వర్షాలు

## పొలాల బాట పట్టిన అన్నదాతలు

**సిరికొండ జూన్ 29 (జనంసాక్షి):**
సిరికొండ మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కొండూరు సమీపంలోని ఒర్రెలు పొంగిపొర్లి కప్పల వాగుకు నీరు చేరడంతో వాగు పరివాహక ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ఈ వర్షం కొత్త ఆశలను చిగురింపజేసింది. వాగులో నీటి ప్రవాహం పెరగడంతో భూగర్భ జలాలు మెరుగుపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు ట్రాక్టర్లతో కరిగేట్ దున్ని నారు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సాగు పనులు జోరందుకోవడంతో గ్రామాల్లో వ్యవసాయ సందడి నెలకొంది.

అయితే రైతుల ఆనందానికి కూలీల కొరత అడ్డంకిగా మారుతోంది. వరి నాట్ల సీజన్ ప్రారంభం కావడంతో కూలీలకు భారీ డిమాండ్ ఏర్పడగా, అవసరమైన స్థాయిలో కూలీలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.మొత్తంగా సకాలంలో కురిసిన వర్షాలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపగా, మంచి దిగుబడులు సాధించాలనే ఆశతో అన్నదాతలు సాగు పనులకు శ్రీకారం చుడుతున్నారు.

# మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

## మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్..




**కరీంనగర్ అర్బన్, జూన్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యారణ్యపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, నిపుణులైన వైద్యులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యంతో పాటు ఎముకలు – కీళ్ల సమస్యలు, జనరల్ సర్జరీ, స్త్రీ – ప్రసూతి వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందచేశారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, బీఎంఐ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. శిబిరంలో డా. లోకేష్ (జనరల్ మెడిసిన్), డా. రాకేష్ (ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ నిపుణుడు), డా. అబ్దుల్ వారిస్ ఉస్మానీ (జనరల్ సర్జన్), డా. నయన (స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు) పాల్గొని రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి ప్రాంతానికే తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ , ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం లో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్

## కుమారి జిన్నా తేజస్విని సందర్శన

**గన్నేరువరం, జూన్ 29 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ కుమారి జిన్నా తేజస్విని కరీంనగర్ ట్రైనింగ్ లో భాగంగా గన్నేరువరం మండల ఎంపీడీవో కార్యాలన్నీ సోమవారం సందర్శించారు. ఎంపీడీఓ విధుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, హెల్త్ సబ్ సెంటర్ ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి,ఎంపీఓ సురేందర్,ఏఈపీఆర్ సురేందర్, హౌసింగ్ ఏఈ మహేందర్, ఎంఈఓ రామయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపల్లి జిల్లా వాసికి జాతీయ స్వర్ణనంది పురస్కారం

## -ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు దక్కిన అరుదైన గౌరవం



**పెద్దపల్లి,జూన్ 29(జనంసాక్షి) :**
కాల్వశ్రీరాంపూర్ మండలం, ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు 2025-26 సంవత్సరానికి గాను జాతీయ స్థాయి స్వర్ణ నంది అవార్డు లభించింది. జూన్ 28,2026 రాత్రి వేద రూరల్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, వేద ఎన్జీవో, ఎంఎఎంకె ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కొమురవెల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి స్వర్ణ నంది అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, అవార్డును అందుకున్నారు.సామాజిక సేవ, విద్యాభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం,యువతను ప్రోత్సహించడం, సమాజ సంక్షేమం కొరకు ఈర్ల సమ్మయ్య చేస్తున్న కృషిని, అతని విశిష్ట సేవలను గుర్తించిన నిర్వాహకులు జాతీయ స్వర్ణ నంది అవార్డు పత్రం, జ్ఞాపిక, పూలమాల,శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈర్ల సమ్మయ్య గత రెండేళ్లుగా ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో రూ. 30.25 లక్షలు మంజూరు చేయించి 3 తరగతి గదులను నిర్మించారు.గ్రామంలో డ్రాపవుట్స్ లేకుండా చేసి, పిల్లల సంఖ్యను గణనీయంగా పెంచారు. దాతల సహకారంతో పాఠశాలకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ నుంచి 40 బెంచీలు తెప్పించారు. పిల్లల కోసం రూ.1లక్ష విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్,రూ. 40 వేల విలువైన వాటర్ ట్యాంక్, గ్లాస్ బోర్డ్, స్మైల్ ఫౌండేషన్, రెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రూ. 8 లక్షల విలువైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్ (స్మార్ట్ టీవీ), సోలార్ ఎలక్ట్రిసిటీ ఏర్పాటు చేయించారు. అతి త్వరలోనే పాఠశాలలో కంప్యూటర్లు, ఏసీలు, ఏర్పాటు చేస్తామని ఈర్ల సమ్మయ్య తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి, పిల్లల చదువులో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు. పిల్లల్ని అద్భుతంగా తయారుచేసి, 2024 నుంచి 2026 వరకు వరుసగా రెండుసార్లు జిల్లా బెస్ట్ స్కూల్ అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈర్ల సమ్మయ్య మహాముత్తారం మండలం నాయక్ పోడ్ కాలనీ మొదటి నియామకం కాబడినారు. అప్పుడు పాఠశాల పశు వుల పాకలో నడుస్తుండేది. పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ కు ఆయన లేఖ రాసి, స్థానికుల ద్వారా అక్కడ చక్కటి పాఠశాల భవనాన్ని నిర్మింప చేశారు. అక్కడ పిల్లలకు చక్కటి విద్యను అందించారు, ప్రాథమిక పాఠశాలలు శ్రీరాంపూర్లో 7ఏడు, శ్రీరాంపూర్ ఎస్సీ కాలనీలో 13 సంవత్సరాలు పనిచేసి, వాటిని అద్భుతంగా తయారు చేశారు. వేలాది మంది విద్యార్థులు, యువతను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దారు. అంతేకాక తన పాటలు, సాహిత్యం, సామాజిక సేవ ద్వారా సమాజంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ అవి అర్హులైన ప్రజలకు అందేలా చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక అవార్డులను అందజేస్తున్నారు. ఈర్ల సమ్మయ్యకు జాతీయస్థాయి స్వర్ణనంది పురస్కారం రావడం పట్ల,అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు,మిత్రులు శ్రేయోభిలాషులు బంధువులు విద్యార్థినీ, విద్యార్థులు గ్రామస్తులు, మండలం,జిల్లాలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేకులు ఆయన సేవలను కొనియాడుతూ అభినందిస్తున్నారు.

# రైతుల సంక్షేమం కోసమే పెట్రోల్ పంపులు ఏర్పాటు

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఆదర్శం నిలుస్తుంది
- రైతుల సౌకర్యార్థం త్వరలో గోదాముల నిర్మాణం
- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు
- ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**సుల్తానాబాద్,జూన్ 29(జనంసాక్షి) :**
రైతులకు అందుబాటులో ఉండి సేవలందించేందుకే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం మండలంలోని నీరుకుల్ల గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పెట్రోల్, డీజిల్ పంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన విప్ ముందుగా గ్రామంలో దాదాపు 50 లక్షల రూపాయలతో చేసిన వివిధ అభివృద్ధి పనులు సిసి రోడ్లు డ్రైనేజీలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేపట్టారు. అనంతరం సహకార సంఘం పెట్రోల్, డీజిల్ పంపు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఉన్న 14 సంఘాలలో 11 సంఘాలను ఏకం చేసి ఎలిగేడు మండలం శివారులో పదిహేను వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో విత్తన శుద్ధి కేంద్రంగా సుల్తానాబాద్ సొసైటీ ఎంపికైందని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో కేవలం 7 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపట్టారని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 20వేల మెట్రిక్ టన్నుల గోదాముల పనులు ప్రారంభించామని మరో 14 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపడుతున్నామని రాబోవు రెండు సంవత్సరాల కాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష పైన మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మహిళలకు మహిళా సంఘాల ద్వారా అందించిన సేవలను టి బి ఆర్ ఎస్ ప్రభుత్వం విస్మరించిందని తిరిగి వాటిని కొనసాగిస్తున్నామని తెలిపారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి భూపతిపూర్ గ్రామాల శివారులో మహిళలకు పెట్రోల్ పంప్ ను ఏర్పాటు చేశామని వివరించారు. రానున్న రోజుల్లో మహిళలందరూ ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని రకాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని అన్నారు. నీరుకుల, కోమండ్లపల్లి , రంగంపల్లి గ్రామాలతో పాటు వేగురుపల్లి గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్ బంకు ఉపయోగపడుతుందన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామం నుండి కాల్వరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్ల మంజూరు కావడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. నీరుకుల గ్రామ ప్రజల కోరిక మేరకు మానేరు వాగు మంచినీరు రెండు నెలల్లోనే అందించేందుకు కృషి చేస్తానని అలాగే ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ బస్సు సౌకర్యాన్ని సైతం కల్పిస్తానని వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ, డి సి ఓ శ్రీ మాల, ఉప సర్పంచ్ దాసరిసతీష్, సీఈవో బుర్గు సంతోష్ కుమార్, తో పాటు,మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, గుండేటి దేవేందర్, శ్రీరంగారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు, రైతు సెల్ మండల అధ్యక్షులు ప రామన్న, మండల అధ్యక్షులు చిలుక సతీష్, మున్సిపల్ అధ్యక్షులు అబ్బయ్య గౌడ్,మాజీ సర్పంచుల పురం మండల అధ్యక్షులు పడాల అజయ్ గౌడ్, పొన్నం చంద్రయ్య గౌడ్, కోటగిరి రమేష్ గౌడ్, తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, వర ప్రదీప్, గాజుల రాజమల్లు, చింతల రాజు,సింగిల్ విండో డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రైతులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వినతీపత్రం ఇచ్చిన కార్పొరేటర్..



**గోదావరిఖని, జనంసాక్షి:**
పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రాన్ని స్థానిక జనగామ 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని-రమేష్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు."జనగామ గ్రామానికి జీవనాధారమైన చెరువును కాపాడండి"అనే ప్రధాన డిమాండ్తో జిల్లా పాలనా అలాగే అధికారులకు విజ్ఞప్తి చేశారు.గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుండి వచ్చే డ్రైనేజీ మురుగునీరు నేరుగా జనగామ గ్రామ చెరువులోకి చేరడంతో గ్రామ ప్రజలు, రైతులు,మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎస్టీపీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, శుద్ధి చేసిన నీటినే చెరువులోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జనగామ గ్రామ చెరువుపై ఆధారపడి సుమారు 250 కుటుంబాలు, 350ఎకరాల సాగుభూమి జీవనోపాధి పొందుతున్నాయి. ప్రస్తుతం కలుషిత నీటి కారణంగా పంటల దిగుబడి తగ్గడం, పశువులు నీరు తాగలేని పరిస్థితి ఏర్పడడం, చెరువులో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి చేపలు చనిపోవడంవల్ల ముదిరాజ్,బెస్త సోదరులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని వివరించారు.సింగరేణికి పోలగం పోసిన ఊరు నేడు పుట్టెడు కష్టాల్లో ఉంది.జనగామ చెరువును కాపాడి గ్రామానికి జీవం పోయాలి"అని అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో కలవేన రవీందర్, అరెల్ల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# 12వ వేతన జేబీసీసీఐ కమిటీ ఏర్పాటు చేయాలి:

## - సింగరేణి అధికారులకు వినతీపత్రాలు ఇచ్చిన సీఐటీయూ..

గోదావరిఖని, జనంసాక్షి:
నేటితో జేబీసీసీఐ-11వ వేతన ఒప్పందం ముగియనున్నదని,జేబీసీసీఐ-12వ వేతన బోర్డు ఏర్పాటు చేసి వేతనాలను సవరించాలని కోరుతూ కోల్ ఇండియాలోని 4 జాతీయ సంఘాల బొగ్గు ఫెడరేషన్ల ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో నిరసనలు, ప్రదర్శనలు చేయాలని నిర్ణయిస్తూ కోల్ ఇండియా సింగరేణి యాజమాన్యాలకు ఇదివరకే లేఖ రాయడం జరిగిందని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఇప్పటివరకు నూతన కమిటీని ఏర్పాటు చేయలేదని,చొరవ తీసుకొని వెంటనే జేబీసీసీఐ-12వ వేతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న లేబర్ కోడ్స్తో సంస్థకు,అధికారులకు,కార్మికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ 4 లేబర్ కోడ్స్ను రద్దు చేయాలన్నారు.తద్వారా సింగరేణిలో పారిశ్రామిక సంబంధాలు దెబ్బతినకుండా చూడాలని, సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేలా పెండింగ్లో ఉన్న బొగ్గు బ్లాకులకు అనుమతులు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ అధ్యక్ష, కార్యదర్శులు వంగల శివరామిరెడ్డి, మెండె శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆసరి మహేష్, పుప్పాల శ్రీనివాసరావు, ఉరుసు సందీప్, పెండెం సమ్మయ్య, సిహెచ్ లక్ష్మణ్, మల్కా కార్తీక్, రవి ప్రసాద్, రమేష్, ఉమాశంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.






# నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

## - బొడ్రాయి కార్యక్రమంలో పాల్గొన్న నల్ల

**సుల్తానాబాద్,జూన్ 29(జనంసాక్షి) :**
పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో పాడిపంటలతో కళకళలాడాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలం లోని గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ మహాలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి కొలుపు కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు భక్తులు పాల్గొన్నారు.

# బెస్ట్ ఎన్జీఓ అండ్ సోషల్ ఆక్టివిస్ట్' లో "నంది అవార్డు పురస్కారం అందుకున్న జగదీశ్వర్"

## గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్..



**కరీంనగర్ బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :** ఆదివారం రోజు రాత్రి మెగా హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సైన్స్ మ్యూజియం లక్డికాపూల్ లో నంది అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ కు 'బెస్ట్ ఎన్జీవో అండ్ సోషల్ ఆక్టివిస్ట్' లో "నంది అవార్డు పురస్కారం అందుకుకున్నారు. గంగిశెట్టి జగదీశ్వర్ 2017 సంవత్సరం నుండి గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ద్వారా చేస్తున్నటువంటి వివిధ సేవా కార్యక్రమాలలో, ప్రభుత్వ సెక్టార్లలో చదువుతున్న విద్యార్థులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు, సమాజంలో వృద్ధులు, వికలాంగులు, పేద వృద్ధ మహిళలు, నిరుద్యోగులు వ్యాధిగ్రస్తులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు ఇలా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరము ఏదో ఒక సేవ కార్యక్రమం నిర్వహిస్తూ, చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి, చేసిన సేవా కార్యక్రమాలకు గాను, నడికూడా మండలంలోని చర్లపల్లి గ్రామంలో నడవలేని దీనస్థితిలో ఉన్న పేద వృద్ధ 12 మంది మహిళలకు వారి ఇండ్లకు స్వయంగా వెళ్లి చీరలు పంపిణీ చేయడం, వరంగల్, కాజీపేట పట్టణాలలో నిర్వహించిన మొబైల్ అన్నదానం కార్యక్రమంలో రోడ్ల పై గల వృద్ధులు, వికలాంగులు, ఆకలితో అలమటించే వారికి స్వయంగా వారి వద్దకు వెళ్లి భోజనం వడ్డించడం వంటి అనేక కార్యక్రమాలకు స్పందించి మెగా హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నందిగా వార్డు ఇవ్వడం జరిగింది. ఈ ఈ సందర్భంగా గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ... నాకు అవార్డు అందించిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానని, నాకు చేతనైనంత పేదవారికి నా ట్రస్టు ద్వారా సహాయం చేస్తానని తెలిపారు. నాకు ఈ నంది అవార్డు టీవీ, తెలుగు ఫిలిమ్స్ డైరెక్టర్లు ప్రసన్నకుమార్, యానాల శివప్రసాద్, ధన్ రాజు చేతుల మీదుగా నంది పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు, ప్రజలు పాల్గొన్నారు.



# సమాచారాన్ని గోప్యంగా ఉంచని ఎక్సైజ్ సిఐ పై చర్యలు తీసుకోవాలి

## సమాచార దాతల భద్రతకు భంగం కలిగిస్తున్నాడని సర్పంచ్ భర్త ఆగ్రహం..

**ముత్తారం జూన్ 29(జనంసాక్షి)** ముత్తారం మండలం సీతంపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ఎక్సైజ్ శాఖకు రహస్యంగా సమాచారం ఇచ్చిన వ్యక్తి పేర్లు ఫోన్ నెంబర్లు సీఐ బహిర్గతం చేస్తున్నారని సర్పంచ్ భర్త ఆరోపణలు చేస్తున్నాడు.గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై గత కొన్ని రోజులగా కొంతమంది గ్రామస్తులు ఎక్సైజ్ సిఐకి ఫోన్ ద్వారా గోప్యంగా ఫిర్యాదు చేస్తుంటే .ఆ సిఐ సమాచారం ఇచ్చిన వారి వివరాలను మద్యం షాప్ యజమానులకు చెప్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామంలో సమాచార దాతలకు వైన్ షాప్ బెల్ట్ షాప్ ల యజమానులు నుండి బెదిరింపులు వస్తున్నాయని అయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో అధికారుల నమ్మకంతో సమాచారం చెబితే పేర్లు బయట పెడుతున్నారని. ఇక ముందు ఎవరూ ధైర్యంగా ఫిర్యాదు చేయడానికి. సమాచార దాతలకు భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అయన తెలిపారు.సమాచారం గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత అధికారిపై ఉందని, నిబంధనలు ఉల్లంఘించిన ఎక్సైజ్ సిఐపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అయన సోమవారం డిమాండ్ చేశారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## - జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి



**పెద్దపల్లి,జూన్ 29(జనంసాక్షి) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని లిజిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన షమిమ్ సుల్తాన తనకు ఇంటి స్థలం కరీంనగర్ లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు కరీంనగర్లో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హోసింగ్ కు రాస్తూ పరిశీలించాలని డిఆర్ఓ తెలిపారు.రామగుండం జై భీమ్ నగర్ కు చెందిన గూపాల స్వామి తాను పక్షవాతంతో బాధపడుతున్నానని తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని ఎంబీఏ చదువు పూర్తి చేశానని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన సాన కొమురయ్య అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్న కుటుంబం నుంచి అక్రమంగా దివ్యాంగుల పెన్షన్, వితంతు పెన్షన్ పొందుతున్న వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్,సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సౌకర్యార్థం సహకార విశ్రాంతి భవనం నిర్మించాలి

**మంథని, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్నటువంటి సహకార సంఘానికి సంబంధించిన స్థలాన్ని రైతుల సౌకర్యార్థం విశ్రాంతి భవనం నిర్మాణం చేయాలని మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన బెల్లంకొండ రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భూమి విషయమై ఎవరు కబ్జా చేయకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కేడీసీసీ బ్యాంక్ కరీంనగర్, పెద్దపల్లి, మంథని బ్రాంచీల వారికి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని ఏ వర్గానికి కేటాయించకుండా రైతుల కోసం వినియోగించాలని ఆయన కోరారు. గతంలో ఖాళీగా ఉన్న ప్రదేశానికి బ్యాంకులో చేనేత సహకారం సంఘం వారు కొంత మొత్తం రుణం తీసుకున్నారు. ఆ బాకీ కి సంబంధించిన సభ్యులు రుణాన్ని విస్మరించడం వల్ల సహకార సంఘం బ్యాంక్ వారు స్వాదినం చేసుకొని గత 20 సంవత్సరాలుగా బ్యాంకు కార్యాలపాలు నిర్వహించారు. అక్కడి నుండి బ్యాంకు వేరే ప్రదేశానికి మార్చినందున ప్రస్తుతం ఖాళీ ప్రదేశాన్ని రైతుల సౌకర్యార్థం సహకార విశ్రాంతి భవనం నిర్మాణం, విత్తనాల నిల్వ కేంద్రంగా మార్చగలరని ఆయన వినతి పత్రంలో కోరారు.

# బీసీ లు పాలితులుగా కాదు పాలకులుగా ఎదగండి

**-బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**- జిల్లాలో బీసీ భవనం కోసం కృషి**

**- బీసీ జేపసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష**

**పెద్దపల్లి,జూన్ 29(జనంసాక్షి) :** దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడి,బీసీలు బానిసలుగా కాకుండా బాదుషాలుగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్లో బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడాలని బీసీ సమాజానికి పిలుపునిచ్చారు.రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉండి,136 కులాల మద్దతు కలిగిన బీసీలు బలహీన వర్గాలు కాదని,వారు ఈ సమాజానికి వెన్నెముక వంటి బలమైన శక్తి అని చెప్పారు.రాబోయే 2028 ఎన్నికలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో 60 మంది బీసీ అభ్యర్థులను గెలిపించుకుని అసెంబ్లీకి పంపడమే బీసీ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.ఓటు అనే పదునైన ఆయుధాన్ని ఉపయోగించి అగ్రకులాల ఆధిపత్యాన్ని ఓడించాలని,తద్వారా రాష్ట్ర పాలనలో బీసీల ముద్ర ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీలిచ్చిన రాజకీయ పార్టీలు ఆ మాట నిలబెట్టుకోలేదని,కేవలం ఓట్ల కోసమే బీసీలను వాడుకుంటున్నాయని మండిపడ్డారు. బీసీలు పాలితులుగా మిగిలిపోవద్దని,పాలకులై తెలంగాణను శాసించాలని శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ఉన్న బీసీ ప్రతినిధులలో సరికొత్త ఉత్తేజాన్ని,పోరాట పటిమను నింపాయి.ఇకనుండి అగ్రకులాలకు ఓటు వేయడాన్ని నిరాకరించాలని,కులాల వారీగా చీలిపోకుండా,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలతో కలిసి బీసీలు ఐక్యంగా పోరాడితేనే సర్దార్ సర్వాయి పాపన్న ఆశించిన సమసమాజం సాధ్యమవుతుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో ఉన్న వివిధ కుల సంఘాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు,బీసీల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బీసీ భవనం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష స్పష్టం చేశారు.స్థానికంగా నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె ఈ మేరకు కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ జిల్లాలో బీసీ భవన నిర్మాణ ఆవశ్యకతపై ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర మంత్రులతో చర్చిస్తామని,ఈ భవన నిర్మాణానికి గట్టి ప్రయత్నం చేస్తామని ఆమె పేర్కొన్నారు.రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నామని, అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలలో తమ బలాన్ని నిరూపించుకుంటామని ఉష ధీమా వ్యక్తం చేశారు.భవిష్యత్తులో గ్రామ మరియు వార్డు స్థాయి వరకు బలమైన కమిటీలను ఏర్పాటు చేసి,బీసీ వాదాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా ఉద్యమిస్తామని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం పెద్దల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్,బీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్,బీసీ విద్యార్థి జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్,మాజీ జెడ్పీటిసి గంట రాములు యాదవ్,మాజీ ఫిషరీస్ చైర్మన్ చేతి ధర్మయ్య,బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండ సతీష్,మహిళా కన్వీనర్ సిరవేణి స్వప్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు మండే లక్ష్మి, నాగమణి,జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లక్ష్మణ్, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య,పెద్దపల్లి మండల అధ్యక్షుడు కలవేన రవి,ధర్మారం అధ్యక్షుడు చాగంటి కొండయ్య తోపాటు రమేష్,లక్ష్మణ్,బుగ్గ రామస్వామి,కాల్వ రమేష్,పోల్దాసరి సాయికుమార్, సదానందం, అబ్దుల్ మాలిక్,రవీందర్,బీరం రవి, అశోక్, రమేష్,కన్నం శ్రావణ్,అరవింద్,తదితర నాయకులకు పాల్గొన్నారు.



# దిగ్విజయంగాలు 42 వ కొండగట్టు గిరి ప్రదక్షణ

**మల్యాల జూన్ 29 (జనం సాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు గిరి ప్రదక్షణ సోమవారం చిలుకూరి బాలాజీ శివాలయ అర్చకులు రామదాస్ సురేశ్ ఆత్మారాం ఆధ్వర్యంలో దిగ్విజయంగా ముగిసింది.ఈ ఆధ్యాత్మిక యాత్రకు ప్రస్తుతం ఆదరణ పెరిగింది భక్తులను ఆధ్యాత్మికత వైపుకు తీసుకెళ్తుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సురేశ్ ఆత్మారాం జి పిలుపు మేరకు వచ్చిన భక్తులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా దారికి ఇరువైపులా గుట్ట ప్రాంతంలో చెట్ల,పండ్ల మొక్కల సీడ్ బాల్స్ (విత్తన బంతులను) విసిరారు.చెట్ల మొక్కలను కూడా నాటారు.

## కరీంనగర్ కార్ఖానా గడ్డ ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలి

### ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్

**కరీంనగర్ బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :**



కరీంనగర్ నగరంలోని కార్ఖానా గడ్డసర్వే నెంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని, భూమిని అక్రమమించడానికి ప్రయతిస్తున్న కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం రోజున ప్రజా వాణి లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 53లో ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించి ఫోర్జరీ ప్రొసీడింగ్ నెంబర్ బి1 /635/06 ద్వారా 11, 14 గుంటల భూమినీ, కల్లేపల్లి బలరాజు అనే వ్యక్తి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అక్రమంగా ఆక్రమించిన ఈ స్థలాన్ని, డాక్యుమెంట్ నెంబర్ 5036/2021 ద్వారా కల్లేపల్లి కనకమ్మ నుంచి తనకు గిఫ్ట్ డీడ్ (బహుమతి) కింద వచ్చినట్లుగా సృష్టించి, బలరాజు తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కార్పొరేటర్ వివరించారు. అంతేకాకుండా, ఆ స్థలం నుంచి సుమారు 779 గజాల స్థలాన్ని అక్రమంగా విక్రయించారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కుల నుంచి కాపాడాలని, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడిన కల్లేపల్లి బలరాజు పై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని రక్షించాలని కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

## మాతమ్మదేవి వార్షికోత్సవానికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి ఆహ్వానం

**భిక్కనూరు జూన్ 29 (జనం సాక్షి):**



భిక్కనూరు మండల కేంద్రంలో గల గిద్ద హరిజనవాడలో నిర్వహించనున్న మాతమ్మదేవి 25వ వార్షికోత్సవ ఉత్సవాల సందర్భంగా చేపట్టిన దేవాలయ పునర్నిర్మాణం మరియు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీని ముఖ్యఅతిథిగా విచ్చేయవలసిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో షబ్బీర్ అలీని కలిసి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్, టీపీసీసీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు దప్పు రవి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈసందర్భంగా ఒక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల విశేషాలను షబ్బీర్ అలీకి వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారు ఆశీస్సులు పొందాలని కోరగా, ఆహ్వానాన్ని ఆయన సాదరంగా స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## బీజేపీ పట్టణ అధ్యక్షుడు అరెస్ట్..

**ఆర్మూర్, జూన్ 29 (జనంసాక్షి):**



ఆర్మూర్ పట్టణంలోని భరత్ చంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ అమీర్ ఖాన్ పై దాడి చేశారనే ఆరోపణలతో ఎంఐఎం, మైనారిటీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్మూర్ పోలీసులు సోమవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలకృష్ణ ను అదుపులోకి తీసుకున్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసంలో ఉన్న బాలకృష్ణను ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్ నేతృత్వంలోని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో తనను మాట్లాడనివ్వాలని, ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలని పోలీసులను అడిగాడు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు.

# బీజేపీ మంత్రిని రాజీనామా చేయమంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కోపమా?

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే దిగిపోవాలి: ఎస్ఎఫ్ఐ ధ్వజం.. నాయకుల ముందస్తు అరెస్టులు

**కరీంనగర్ టౌన్, జూన్ 29 ( జనంసాక్షి)**

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ లోని లోక్ భవన్ ముట్టడికి సిద్ధమవుతున్న కరీంనగర్ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం నిర్వహించే కార్యక్రమాలకు యథేచ్ఛగా అనుమతులు ఇచ్చే ప్రభుత్వం, ప్రజా సమస్యలపై పోరాడే ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు నిర్వహించే నిరసనలకు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే కార్యకర్తలను, నాయకులను ఇండ్లల్లో ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ మంత్రిని రాజీనామా చేయమంటే ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు కోపం వస్తోందని ఆయన నిలదీశారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, రాత్రింబవళ్లు చదివి వైద్య విద్యలో ప్రవేశం కోసం నీట్ పరీక్ష రాశారని శ్రీకాంత్ గుర్తుచేశారు. రాజస్థాన్‌లో జరిగిన పేపర్ లీకేజీ కారణంగా ఈ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, కలలు పూర్తిగా ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి మంచి ర్యాంక్ సాధించి డాక్టర్ కావాలని కలలు కన్న పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశలను ఈ లీకేజీ దెబ్బతీసిందన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శాంతియుత నిరసన



చేపట్టాలనుకున్న విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరైన చర్య కాదని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ముందస్తు అరెస్టులతో ఉమ్మడి ఉద్యమాలను ఆపలేరని, విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- ○వ్యక్తిగత కక్షతో కారుతో ఢీకొట్టి కర్రతో దాడి
- ○ఘటనలో ఉపయోగించిన మారుతి 800 కారు, చెక్క కర్ర, ఐఫోన్ మొబైల్ ఫోన్ స్వాధీనం
- ○కేసు వివరాలను వెల్లడించిన సదాశివనగర్ ఎస్‌హెచ్ఓ పుష్పరాజ్

**సదాశివనగర్ జూన్29 (జనంసాక్షి)**

సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన గైని రమేష్ తన మోటార్ సైకిల్‌పై రాత్రి 8 గంటల సమయంలో వెళ్తుండగా, గుర్తు తెలియని కారు వెనుక నుండి ఢీకొట్టి, అనంతరం చెక్క కర్రతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ హెచ్ ఓ పుష్పరాజ్ తెలిపారు .



దర్యాప్తులో భాగంగా, గతంలో నమోదైన క్రిమినల్ కేసు కారణంగా ఏర్పడిన వ్యక్తిగత కక్షతో ధర్మారావుపేట గ్రామానికి చెందిన గాండ్ల లావణ్య మరియు ఆమె తమ్ముడు గాండ్ల సతీష్ ముందస్తు పథకం ప్రకారం గైని రమేష్‌ను హత్య చేయాలనే ఉద్దేశ్యంతో కారుతో అతని మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టి, అనంతరం చెక్క కర్రతో దాడి చేసినట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర దర్యాప్తు ఆధారాల మేరకు నిందితులు గాండ్ల లావణ్య మరియు గాండ్ల సతీష్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఘటనలో ఉపయోగించిన మారుతి 800 కారు, చెక్క కర్ర, ఐఫోన్ మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ఘటన స్థలం నుంచి ఇతర భౌతిక ఆధారాలను కూడా సీజ్ చేశారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు సదాశివనగర్ ఎస్‌హెచ్ఓ శ్రీ పుష్పరాజ్ తెలిపారు. సదాశివనగర్ ఎస్‌హెచ్ఓ శ్రీ పుష్పరాజ్ మాట్లాడుతూ..వ్యక్తిగత కక్షలు, పగలు, ప్రతీకార భావంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తీవ్రమైన నేరమని అన్నారు. ఎలాంటి విభేదాలు ఉన్నా చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. హత్యాయత్నాలు, దాడులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గాంధారిలో నూతన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ , డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్..

జనం సాక్షి జూన్ 29 గాంధారి:

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, ప్రజలకు పార్టీని మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ మరియు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ గాంధారి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మదన్‌మోహన్, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలమని, ప్రజల సంక్షేమం మరియు ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే సేవా వేదికగా ఈ నూతన కార్యాలయం నిలవాలని ఆకాంక్షించారు. డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ఈ కార్యాలయం కార్యకర్తలకు మార్గదర్శక కేంద్రంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ మరియు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు




మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# యాప్‌తో యూరియా.. రైతులకు యాతన..!

**ఫర్టిలైజర్ యాప్ ఓపెన్ కాక ఆపసోపాలు**

**సాంకేతికత పేరుతో కొత్త కష్టాలు**

**ఎరువుల కోసం అన్నదాతల అగచాట్లు**

**సదాశివనగర్, జూన్29 (జనంసాక్షి)**
వానాకాలం సాగు పనులు ఊపందుకున్న వేళ రైతులకు అత్యవసరమైన యూరియా ఎరువు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సౌలభ్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన యాప్ వ్యవస్థ క్షేత్రస్థాయిలో మాత్రం కొత్త సమస్యలకు దారితీస్తోందని మండలంలోని రైతులు ఆరోపిస్తున్నారు.యాప్ పనిచేయకపోవడం, సర్వర్ తరచూ డౌన్ కావడం, వేలిముద్రలు సరిపోకపోవడం, నెట్‌వర్క్ సమస్యలతో గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.రైతులకు అత్యవసరంగా అవసరమైన సమయంలో యాప్ ఆధారిత పంపిణీ విధానాన్ని అమలు చేయడం వల్ల సాగు పనులు ఆలస్యం అవుతున్నాయని, పంటలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను పట్టించుకోకుండా కేవలం యాప్‌లపైనే ఆధారపడటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులు ఎరువుల కోసం కార్యాలయాలు, దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైతు సంక్షేమం మాటల్లోనే ఉందే తప్ప, ఆచరణలో కనిపించడం లేదని మండిపడుతున్నారు.

**రైతుల డిమాండ్లు**

యాప్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

సర్వర్, నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి.యాప్‌తో పాటు ప్రత్యామ్నాయంగా మాన్యువల్ విధానంలో కూడా యూరియా పంపిణీ చేయాలి. రైతులు ఇబ్బంది పడకుండా తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలి.

"రైతు కోసం తీసుకొచ్చిన యాప్... రైతుకే శాపంగా మారిందని" అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియా పంపిణీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే రైతుల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.






# పొలం వద్దకే వెళ్లి పోలియో చుక్కలు

## ఏఎన్ఎం స్వప్న సేవలకు ప్రశంసలు

**సిరికొండ జూన్ 29 (జనం సాక్షి):**
సిరికొండ మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో నిన్న 95.6 శాతం మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. కార్యక్రమం రెండో రోజు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, అనివార్య కారణాల వల్ల పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి వారికి వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ సిబ్బంది చేపట్టారు.ఈ క్రమంలో సిరికొండ మండలంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుండి వరి నాట్లు వేయడానికి పెద్ద సంఖ్యలో కూలీలు మండలానికి వచ్చారు. వారిలో కొందరు తమ చిన్న పిల్లలను వెంట తీసుకుని పొలాల్లో పనులు చేస్తున్నారు.

పెద్ద వాల్గొట్ ఆరోగ్య ఉపకేంద్రానికి చెందిన ఏఎన్ఎం స్వప్న విధి నిర్వహణలో భాగంగా సిరికొండ?చిన్న వాల్గొట్ రహదారి సమీపంలోని వ్యవసాయ పొలాలను సందర్శించారు. అక్కడ పనుల్లో నిమగ్నమైన పశ్చిమ బెంగాల్ కూలీలను కలిసి పోలియో వ్యాధి ప్రమాదాలు, వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం “రెండు చుక్కలు ? నిండు జీవితానికి” అనే నినాదాన్ని గుర్తుచేస్తూ, వ్యాక్సిన్ బాక్స్‌ను నేరుగా పొలం వద్దకే తీసుకెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.చిన్నారుల ఆరోగ్యం కోసం క్షేత్రస్థాయిలో చూపిన ఈ చొరవను చూసిన రైతులు, కూలీలు హర్షం వ్యక్తం చేశారు. ఒక ఆరోగ్య కార్యకర్త తన విధి నిర్వహణలో భాగంగా ఎంత నిబద్ధతతో పనిచేయవచ్చో ఏఎన్ఎం స్వప్న నిరూపించారని స్థానికులు కొనియాడారు.ప్రతి చిన్నారికి పోలియో రక్షణ కల్పించాలనే లక్ష్యంతో, అందుబాటులో లేని పిల్లలను వెతికి మరీ వ్యాక్సిన్ అందించడం ఆరోగ్య శాఖ సేవాభావానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ఏఎన్ఎం స్వప్న చూపిన సేవా తత్పరతకు జనం సాక్షి తరఫున ప్రత్యేక అభినందనలు.

# పలు కుటుంబాలను పరామర్శ

గంభీరావుపేట జూన్ 29(జనం సాక్షి);
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించిన మార్కెట్ డైరెక్టర్ కోట లింగం కుమారుడు, అనిల్ యాదవ్ బంగ్లా రమేష్ కుమారుడు అన్వేష్ గౌడ్, కుటుంబాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మరణాలపై అడిగి తెలుసుకుని వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు, వీరితోపాటు కాంగ్రెస్  నాయకులు ఉన్నారు

**విద్యుత్ షాక్ తో గాయపడిన మల్యాల రాజ్వీర్ ను పరమశించిన సంగీతం**

**శ్రీనివాస్ ,కొండూరి**
విద్యుత్ షాక్ గురైన మల్యాల రాజ్వీర్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తో పాటు నాస్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం నింపారు వీరితోపాటు కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు





## స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ పై వివిధ పార్టీల తో సమావేశం

## హాజరైన తాసిల్దార్ మారుతి రెడ్డి

**గంభీరావుపేట జూన్ 29(జనం సాక్షి);**
రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ (సార్) ప్రక్రియపై గుర్తింపు పొందిన పార్టీల మండల బూత్ లెవల్ ఏజెంట్లు బిఎల్ఎ , సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల స్థాయిలో మొత్తం 36737 ఓట్లు ఉండగా, 25 వేల 918 ఫారాలు పంపిణీ జరిగాయని, మరి రెండు రోజుల్లో మిగతా 10800 పంపిణీ చేస్తామని అన్నారు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు బి ఎల్ వోలు,ఓటర్ల సర్వే కోసం ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలు తమ పేరు, చిరునామా, కుటుంబ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకుని, సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమానికి ఓటరు సహాయ నమోదు అధికారిగా మారుతి రెడ్డి అధ్యక్షతన నడుస్తుందని, వివిధ పార్టీలు మరియు ప్రజల సహకారంతో ముందుకు వెళ్తానని దీనికి అందరూ సహకరించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో( ఏ ఈ ఆర్ వో) ఓటరు సహాయ నమోదు అధికారి, మారుతి రెడ్డి,ఆర్ ఐ సత్యం, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఓట్ల జాబితా సమగ్రసవరణ ప్రక్రియ(సర్) లో పాల్గొన్న వొడితల ప్రణవ్

**- బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి**

**- ప్రతి బీఎల్ఏ విధిగా బీఎల్ఓతో సర్ కార్యక్రమంలో పాల్గొనాలి**

**- కొత్త ఓటర్లను జాబితాలో చేర్పించాలని సూచన**

**- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్**

**హుజురాబాద్, జూన్ 29 (జనం సాక్షి) :**
ఓటు జాబితా సవరణ ప్రక్రియ సర్ కార్యక్రమంలో ప్రతి బిఎల్ఏ తప్పనిసరిగా పాల్గొనాలని ప్రతి ఓటు చాలా ముఖ్యం కాబట్టి జాగ్రత్తగా వ్యవహరించాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సూచించారు.సోమవారం హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలో ఇంటింటికి జరుగుతున్న ఓటర్ జాబితా సమగ్ర సర్వేలో కో ఆర్డినేటర్లతో కలిసి ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అన్ని బూత్ లలో బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని,బిఎల్ఓలు ఇచ్చే సెట్ లను జాగ్రత్తగా నింపాలని,కొత్త ఓట్ల నమోదు ప్రక్రియలో అవగాహన కల్పించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ఈ సవరణ ప్రక్రియ నిశితంగా పరిశీలిస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు ఒక్క ఓటు కూడా కోల్పోకుండా,గల్లంతు అవ్వకుండా నమోదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్ ప్రక్రియ కో ఆర్డినేటర్లు, మండల అధ్యక్షుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు,గ్రామ శాఖ కో ఆర్డినేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# యూరియా యాప్‌ను వెంటనే అప్డేట్ చేసుకోండి

## సొసైటీ సీఈఓ గిరిరాజు

**తాజా వెర్షన్ (1.0.11) వినియోగంతో సాంకేతిక సమస్యలకు చెక్ ?**

**రైతులకు కీలక సూచనలు**

**సిరికొండ జూన్ 29 (జనం సాక్షి):**
రైతులకు యూరియా ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అందుబాటులో ఉంచిన యూరియా యాప్‌ను తప్పనిసరిగా తాజా వెర్షన్ (1.0.11)కు అప్డేట్ చేసుకోవాలని సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) సీఈఓ మొట్టల గిరిరాజు సూచించారు.ప్రస్తుతం కొందరు రైతుల మొబైల్ ఫోన్లలో పాత వెర్షన్ యాప్ ఉండటంతో యాప్ వినియోగంలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ముందుగా తమ మొబైల్‌లో ఉన్న పాత యూరియా యాప్‌ను తొలగించి, అనంతరం గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న జఖీఇం ంఖఖ ఎవతీబతినీని 1.0.11ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు.తాజా వెర్షన్ యాప్‌ను వినియోగించడం ద్వారా యూరియా పంపిణీ ప్రక్రియ మరింత సజావుగా సాగుతుందని, రైతులు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా సేవలను పొందవచ్చని గిరిరాజు పేర్కొన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ రైతుల కోసం అందిస్తున్న డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి రైతు యాప్‌ను వెంటనే అప్డేట్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.యూరియా ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం, ఖచ్చితత్వం కోసం ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తోందని, రైతులు తాజా వెర్షన్‌ను వినియోగించి సేవలను సులభంగా పొందాలని సొసైటీ సీఈఓ సూచించారు.



# కామారెడ్డి విద్యార్థి బన్నీ పర్వతారోహణలో మరో ఘన విజయం

## లడఖ్‌లోని కైగర్ రి పర్వతాన్ని అధిరోహించిన కామారెడ్డి గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థినిని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్,.




**కామారెడ్డి ప్రతినిధిజూన్ 29 (జనం సాక్షి)**
కామారెడ్డి పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థి విస్లావత్ బన్నీ లడఖ్ ప్రాంతంలోని 6,100 మీటర్ల ఎత్తైన కైగర్ రి (ఐజీతిణజీతీ ఖీతి) పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించి విశేష ప్రతిభ కనబరిచాడు.బన్నీ జూన్ 14న పర్వతారోహణను ప్రారంభించి, జూన్ 19 ఉదయం 8 గంటలకు శిఖరాన్ని చేరుకున్నాడు. శిఖరంపై భారత జాతీయ త్రివర్ణ పతాకంతో పాటు తెలంగాణ గిరిజన సంక్షేమ విద్యాసంస్థల సొసైటీ (ఐచిఖీఇమో) కళాశాల ఫ్లెక్సీని ప్రదర్శించి తన దేశభక్తిని, కళాశాలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు.కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ బన్నీ గతంలో కిలిమంజారో, కాంగ్ యత్సే పర్వతాలను కూడా అధిరోహించి తన సత్తా చాటుకున్నాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బన్నీ ఈ ఘనత సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశం మందిరం లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం విద్యార్థిని అభినందించి, శాలువతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బన్నీ సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. అతను భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అతని విజయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శ్రీనివాస స్వామి పాల్గొన్నారు.



## పిట్లం లయన్స్ క్లబ్ కు జిల్లా ఉత్తమ క్లబ్ అవార్డు

**పిట్లం జూన్ 30(జనం సాక్షి)**
పిట్లం లయన్స్ క్లబ్ విస్తరిస్తున్న సేవల గాను కంటి వైద్య శిబిరాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పేద విద్యార్థులకు ఉన్నత విద్యా కొరకు ఆర్థిక సాయం, అవగాహన కార్యక్రమాలు వంటి సేవలపై హైదరాబాద్ లో జరిగిన జిల్లా స్థాయి అవార్డు కార్యక్రమంలో రూరల్ విభాగంలో పిట్లం లయన్స్ క్లబ్ కు జిల్లా ఉత్తమ క్లబ్ అవార్డు వచ్చినట్లు అధ్యక్షుడు నారాయణ తెలిపారు. ఈ అవార్డు తోపాటు వ్యక్తిగత విభాగంలోనూ జిల్లా ఉత్తమ రీజియన్ చైర్మన్ గా అనిత రెడ్డి, రీజియన్ కో-ఆర్డినేటర్ గా మార్గాల వేణు, ఉత్తమ మండల అధ్యక్షులుగా మున్నూరు నారాయణ కు అవార్డులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం లయన్స్ క్లబ్ సభ్యులు కిషన్, మారుతి రెడ్డి, పుట్నాల లక్ష్మీనారాయణ,బాలు, ప్రసాద్, శేఖర్, ఆబేద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన 101 దరఖాస్తులు స్వీకరణ



**కామారెడ్డి ప్రతినిధి జూన్ 29 (జనంసాక్షి)**
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 101 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా భూ సమస్యలు, విద్యాశాఖ, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, గృహాలు, ఉపాధి, విద్యుత్, మున్సిపల్,వ్యవసాయం సదరం క్యాంపులు, తదితర శాఖలకు సంబంధించిన వినతులను ప్రజలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఔపి గిరి, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఏరువాక పౌర్ణమిన ప్రత్యేక పూజలు

**పెద్ద కొడప్గల్ జూన్ 29 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామ లక్ష్మీమాత ఆలయం వద్ద సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కౌలాస్ శ్రీమహంతేశ్వర మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 108 ష.బ్ర మల్లిఖార్జున శివాచార్యులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి, సీతారాంపల్లి, అంజని గ్రామాల భక్తులు ఉన్నారు.

## మాఘ పౌర్ణమి వేళ గంగమ్మ తల్లి ఆలయంలో భక్తి పారవశ్యం

### ప్రత్యేక పూజలు, అన్నసత్రం నిర్వహించిన ఆలయ కమిటీ ?

### శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు



**సిరికొండ జూన్ 29 (జనంసాక్షి):**
సిరికొండ మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తి శ్రద్ధల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నసత్ర కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలను తిలకించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సాయంత్రం నిర్వహించే శోభాయాత్రతో పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా ప్రతి సంవత్సరం ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రదీప్, సతీష్, అమర్, గంగాధర్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధం

### జిల్లా అధ్యక్షుడు కుంటోళ్ల యాదయ్య

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 29 (జనంసాక్షి)**
న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఎడఖీ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న జర్నలిస్టులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంటోళ్ల యాదయ్య మండిపడ్డారు. దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, గృహ సౌకర్యం వంటి న్యాయమైన సంక్షేమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న అసోసియేషన్ నాయకులు, సభ్యులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడం, పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుంటోళ్ల యాదయ్యతో పాటు తెడ్డు సాయిలు, పెరుమాండ్ల రాజు, బాలాజీ, ఆశన్న, సుంకరి సంజీవ్, కీసరి రాజుతో పాటు జిల్లా వ్యాప్తంగా హౌస్ అరెస్ట్ చేసిన జర్నలిస్టులందరినీ వెంటనే ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేయకుండా, జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్రిడ్జ్ వితరణ




**పిట్లం జూన్ 30 (జనం సాక్షి)**
పిట్లం లయన్స్ క్లబ్ మాజీ రీజియన్ చైర్మన్ కాంచం రాజేంద్రప్రసాద్ జన్మదినం సందర్భంగా పిట్లం ప్రభుత్వా ఆసుపత్రికి ఫ్రిడ్జ్ అందించడం జరిగింది. వాక్సిన్ స్టోరేజ్ కొరకు ఫ్రిడ్జ్ అవసరం ఉందని ఫార్మసిస్ట్ శ్రీనివాస్ లయన్స్ అధ్యక్షులు నారాయణ దృష్టికి తేవడం తో రాజేంద్ర ప్రసాద్ స్పందించి వెంటనే ఆసుపత్రికి 16 వేల విలువగల ఫ్రిడ్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శుభాంగి కి అందించారు, ఈ కార్యక్రమం లో కార్యదర్శి బాలు, కోశాధికారి మారుతీ రెడ్డి, రీజియన్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, సభ్యులు లక్ష్మీనారాయణ, చంద్ర శేఖర్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పరిశీలించిన సర్పంచ్



**మల్లాపూర్, జూన్ 29 (జనంసాక్షి)**
మండల కేంద్రం లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ను మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ పాలక వర్గం ఆధ్వర్యంలో పరిశీలించి,కార్యక్రమం పై సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఈ ప్రత్యక్ష సమగ్ర సవరణ కార్యక్రమం ఉపయోగించుకోవాలని,ఈ సర్వేకు బీ.ఎల్.ఓ లు ఇంటింటికీ వచ్చి ముద్రిత (ఎన్యుమరేషన్) ఫారాలను అందజేస్తారు.అధికారులు ఇచ్చిన ఫారంలో మీ ఓటరు వివరాలను, ఫోటోను సరిచూసుకోవాలని,ఎలాంటి మార్పులు, చేర్పులు ఉన్నా తగిన ధ్రువీకరణ పత్రాలు (ఆధార్, పాన్ కార్డ్, ఓటరు గుర్తింపు కార్డు తదితరులు) సమర్పించాలి.అనంతరం ఫారంపై సంతకం చేసి, వివరాలను తిరిగి బీ.ఎల్.ఓ కు అందించాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో జీ.పీ.ఓ జల,అంగన్వాడీ కార్యకర్త రాధ,వార్డు సభ్యులు ముష్కరి రమేష్,కొంపల్లి రాకేష్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థినికి నటరాజ నందీశ్వర అవార్డు

**కొత్తపెల్లిజూన్ 29 (జనంసాక్షి)**
విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొని విజయం సాధించే దిశగా ప్రోత్సాహం అందించాలని తద్వారా వారికి సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని మరియు వివిధ స్థాయిలలో ఉత్తమమైన అవార్డులు వస్తాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ అవార్డ్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఏర్పాటు చేసినటువంటి అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కళలపట్ల నైపుణ్యం చాలా అవసరమని చెప్పారు. ఒత్తిడి నుండి ఉపశమనం లభించడమే కాకుండా తరగతి గదిలో బోధిస్తున్నటువంటి విషయాలను చాలా సులభంగా నేర్చుకోగలుగుతారని వారు చెప్పారు. సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు వస్తుందని వారు చెప్పారు. విద్యాసంస్థలో విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం జరుగుతున్నదని మరియు వివిధ స్థాయిలో నిర్వహించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరై విజయాలను సాధిస్తున్నారని మరియు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని వారు చెప్పారు. ఈ క్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో హైదరాబాద్కు చెందినటువంటి ప్రముఖ సాంస్కృతిక సంస్థ అయిన నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ వారు రవీంద్రభారతిలో నిర్వహించినటువంటి కార్యక్రమంలో పాఠశాలలకు చెందినటువంటి జె. అద్రితి రావు, 3వ తరగతి, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి నందీశ్వర అవార్డును గెలుచుకోవడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఒ విద్యార్థులు పాల్గొన్నారు.






## ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన ఎంపీడీవో లచ్చులు

**ముస్తాబాద్ జూన్ 29 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీవో లచ్చాలు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో 90% పూర్తి అయినయి మిగతా మిగిలిపోయిన పండ్లను కూడా పూర్తి చేసుకోవాలి పూర్తి బిల్లు ప్రభుత్వము వేస్తుంది. ఎంత తొందరగా పూర్తి చేసుకుంటే అంత తొందరగా కూడా బిల్లులు అందిస్తుంది. మొదటి విత్త పూర్తి చేసుకుంటే రెండో విడత ఇంద్రమీనులు వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగురు నరేష్ గ్రామ కార్యదర్శి నవ్య, వార్డ్ మెంబర్లు యాదగిరి గౌడ్ , ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బంజరుపల్లె పాలకేంద్రం అధ్యక్షుడిగా గుండెకారి మాధవ్ ఎన్నిక..

### 10వసారి మాధవ్ ఎన్నికపట్ల పాలఉత్పత్తిదారుల హర్షం



**చిగురుమామిడి జూన్ 29 (జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని బంజేరుపల్లి కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంస్థ ఆవరణలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను చర్చించిన అనంతరం అధ్యక్షుడిగా 10వ సారి గుండెకారి మాధవ్ ను,డైరెక్టర్లుగా జంపురి హరీష్,గంధం రాజయ్యలను ఎన్నుకున్నట్లు రూట్ సూపర్వైజర్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం, డెయిరీ అభివృద్దె ధ్యేయంగా కృషి చేస్తాననిచెప్పారు. ప్రతి రైతు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. డేయిరీ చైర్మన్ రాజేశ్వర్ రావు సహకారంతో రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన డైరెక్టర్లకు,సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట్ సూపర్ వైజర్ అప్పాల మల్లయ్య,డైరెక్టర్లు గంధం అశోక్,గుండెకారి రాజు,గంధం నారాయణ,గంధం బక్కయ్య,గంధం అశోక్,సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



## చిల్లర్గి లో ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించిన సర్పంచ్ రాధా మురళీధర్ గౌడ్

**పిట్లం జూన్ 30(జనం సాక్షి)**
పిట్లం మండల పరిధిలోని చిల్లర్గి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రీ ప్రైమరీ స్కూల్ ను స్థానిక సర్పంచ్ రాధా మురళీధర్ గౌడ్ ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ తెలిపారు. సర్పంచ్ రాధా మురళీధర్ గౌడ్,ఎంఈఓ దేవి సింగ్, ఉపాధ్యాయులు అందరూ కలిసి పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ మాట్లాడుతూ..
నాలుగు సంవత్సరాలు పైబడిన పిల్లలకు ప్రత్యేకంగా విద్యాబోధన ఇన్స్ట్రక్టర్ సాయంతో బోధన నిర్వహించడం జరుగుతుందని అన్నారు. చిన్ననాటి నుండి పిల్లలకు బడిపైన ఎక్కువ మక్కువ కలిగే విధంగా అవగాహన, ఆసక్తి కనుబరుస్తారని ముఖ్య ఉద్దేశంతో విద్యాభివృద్ధి ఘన నీయంగా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆలోచనతో ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ప్రాథమిక పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు విటల్, చిల్లర్గి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి సింగ్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయం ముందు సీసీ రోడ్డు నిర్మాణం

### పనులు ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మణ్



**మల్లాపూర్,జూన్ 29(జనంసాక్షి )**
మండల కేంద్రంలో ఊర పెద్ద పోచమ్మ ఆలయం ముందు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సి.సి రోడ్డు పనులు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామంలో ముఖ్యం గా ఎక్కడ అవసరమున్నా అక్కడ సి.సి రోడ్లు నిర్మిస్తాన్నమని, గ్రామ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి,మాజీ ఎం.పీ.టీ.సీ మరిపెల్లి సత్తమ్మ- మల్లయ్య,వార్డు సభ్యులు ముష్కరి రమేష్,కొంపల్లి రాకేష్, కాషవత్తుల గంగా రెడ్డి, భూక్య శేఖర్, ఎనుగంటి నరేష్ ముత్యాల గంగారాజం,శనివారపు లావణ్య -నరేష్ అల్లె లత-చంద్రయ్య, పెద్దిరెడ్డి లక్ష్మణ్, ఉయ్యాల లక్ష్మణ్,మకిలి(బుజ్జితల్లి) రాకేష్,పాల్త్య గంగాధర్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హంపి పీఠాధిపతి జన్మదిన వేడుకలు



**పిట్లం జూన్ (జనం సాక్షి)**
పిట్లం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీశ్రీశ్రీ జగద్గురువు శంకరాచార్య విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి హంపి పీఠాధిపతి జన్మోత్సవ వేడుకలను అయ్యప్ప స్వామి ఆలయంలో కమిటి సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి పాదుకలకు పూజలు చేసి,భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. మధ్యాహ్నం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి శాశ్వత అధ్యక్షుడు ఈశ్వర్ దయాళ్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీష్ ,భగవాన్, నర్సగౌడ్, మంచి శశిధర్,బొడ్ల రాజు,గంగ సందీప్,కోట సిద్ధులు, వెంకట్ రెడ్డి,వేణు మాధవ్ రెడ్డి,సాయి ప్రసాద్, రఘు,గణేష్,సాయి కిరణ్ యాదవ్,రాజు,పడిగేల కుమార్,భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడించిన దళిత గిరిజన జర్నలిస్టులు న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని వినతి పత్రం అందజేత



**ముస్తాబాద్ జూన్ 29 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్రంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న దళిత గిరిజన జర్నలిస్టులందరికీ అందించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర దళిత గిరిజన జర్నలిస్టుల వ్యవస్థాపక అధ్యక్షులు కట్కూరి మల్లేశం ఆధ్వర్యంలో సోమవారం రోజున అన్ని జిల్లాల దళిత గిరిజన జర్నలిస్టులతో కలిసి హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అడిషనల్ డైరెక్టర్ డి ఎస్ జగన్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ దళిత గిరిజన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డ్ హెల్త్ కార్డ్స్ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు దళిత గిరిజన జర్నలిస్టులపై జరుగుతున్న వివక్షతను నిర్మూలించాలి 33 జిల్లాల అక్రిడేషన్ కమిటీలో మా అసోసియేషన్ కు చెందిన ఇద్దరు ప్రతినిధులకు సభ్యులుగా నియమించాలి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న దళిత గిరిజన జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రీయింబర్స్మెంట్ కల్పించాలి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వెంటనే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించి ఉచిత విద్య అందేలా చర్యలు తీసుకోవాలి 55 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులందరికీ నెలకు 20వేల రూపాయల పెన్షన్ అందించాలి ప్రతి జిల్లాలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రత్యేక ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చేయాలి జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టి ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలి కోరుతూ మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు అన్ని జిల్లాల జర్నలిస్టులతో కలిసి కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు కట్కూరి మల్లేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంచు బాబు అన్ని జిల్లాల దళిత గిరిజన జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సిసి రోడ్ నిర్మాణానికి హామీ సంఘ సభ్యులు శాలువా సన్మానం

**జనంసాక్షి జూన్ 29 గాంధారి:**
ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, పద్మశాలి సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా సన్మానం చేశారు. గాంధారి మండలం కేంద్రంలో నారాయణ గిరి వద్ద శివ భక్త మార్కండేయ మందిరం సిసి రోడ్ నిర్మాణాని కోసం ఎమ్మెల్యే తప్పనిసరిగా సిసి రోడ్డు వేయిస్తానని అని హామీ ఇచ్చాడు. సంఘ సభ్యులు వర్షం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు గుంటుకు అశోక్, సంఘం అధ్యక్షులు క్యాతం కృష్ణ, ఉపాధ్యక్షులు సామల రాజు, కోశాధికారులు తాటిపాముల శివ, కార్యదర్శులు, సామల విజయ్, అంబల్ల సంతోష్, తలకొక్కుల శంకర్, శ్రీనివాస్, భాస్కర్, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## ఉర్సు ఉత్సవాలకు రామంచ దర్గా ముస్తాబు..

**ఈనెల 30న జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలి..**

**దర్గా నిర్వాహకుడు మహమ్మద్ కరీంఖాన్ వెల్లడి..**

చిగురుమామిడి జూన్ 29(జనంసాక్షి):కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామంలో ఈనెల 30న మంగళవారం,1న బుధవారం రెండు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాలకు రామంచ దర్గాను ముస్తాబు చేసి,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా నిర్వహుకుడు మహమ్మద్ కరీంఖాన్ తెలిపారు.జిల్లాలోనే రెండో అతి పెద్దదిగా పోరొందిన ఈ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను పూలమాలలతో,విద్యుత్ బల్బులతో అందంగా ముస్తాబు చేసినట్లు చెప్పారు.దర్గాలో ఈనెల 30న రాత్రి నుండి జులై 1న బుధవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక పార్థనలు కోనాసాగుతాయని చెప్పారు.వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.సందల్ ఊరేగింపులో పాల్గోని దర్గాలో మొక్కులు తీర్చుకోవాలని కోరారు.ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు,చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లు చేస్తున్నమని,భక్తులకు అన్నదానం సైతం ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహుకుడు కరీంఖాన్ వివరించారు.

## భిక్కనూరు సొసైటీలో సహకార వారోత్సవాలు

భిక్కనూరు జూన్ 29 (జనం సాక్షి):
భిక్కనూరు మండల కేంద్రంలో గల సొసైటీ సహకార సంఘం ఆధ్వర్యంలో సొసైటీ వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు, ఈ క్రమంలో సొసైటీ చైర్మన్ గంగల భూమయ్య,వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలు కీలకం అన్నారు, సహకార సంఘాలను మరింత బలోపేతము చేసి రైతులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు, రైతులకు అందుబాటులో ఉన్న పథకాలపై అవగాహన కల్పించి సొసైటీ ద్వారా రైతులకు అందించే విత్తనాలు ఎరువులు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు, క్రమంలో సొసైటీ సీఈవో రాజు, డైరెక్టర్లు వెంకట్ గౌడ్, అంబల్ల మల్లేశం,అందే జయమ్మ, పెద్దబచ్చగారి మైపాల్ రెడ్డి, ఉప్పరి సాయిలు, ఎండి సాజిద్, సిబ్బంది బాసం స్వామి, పసుల రవి కిరణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## గంగపుత్రుల గంగమ్మ బోనాల జాతర లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రుద్రంగి జూన్ 29 (జనం సాక్షి)**
రుద్రంగి మండలకేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగమ్మ బోనాలు జాతర మరియు వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.గంగమ్మ తల్లి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కూరవలని పాడిపంటలతో ప్రజలు రైతులు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు.అనంతరం గంగపుత్ర సంఘ సభ్యులు మాట్లాడుతూ...గంగమ్మ ఆలయం వద్ద విద్యుత్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కొరగానే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి దాదాపు 5లక్షల రూపాయలతో విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. కార్య క్రమంలో ఏఎంసి చైర్మన్ చేలుకల తిరుపతి, తాసిల్దార్ పుష్పలత, సర్పంచ్ గండి నారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగా నరసయ్య,మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, పొద్దుపొడుపు లింగారెడ్డి,గడ్డం శ్రీనివాస్,గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశవేణి ధర్మేష్, పల్లి గంగాధర్, గుగ్గిళ్ళ వెంకటేశం,ఎర్రం అరవింద్, ద్యావల రవి, తోకల రమేష్, దేశవేని శ్రీనివాస్,దేశ వేణి భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 1న వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి..




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 29 జనంసాక్షి:**
సిపిఐ జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు అదేవిధంగా అర్హులైన నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జులై ఒకటో తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాకు వామపక్ష పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునివ్వడం జరిగిందని అందులో భాగంగా జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తరలి రావాలని కోరారు. ఇప్పటికే అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా నగరంలో నివసిస్తున్న అనేకమంది నిరుపేద మధ్య తరగతి ప్రజలు అద్దె ఇండ్లలో కిరాయిలను భరించలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని అటువంటి వారికి అనేకమార్లు ఇండ్ల పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ గత ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే రెండున్నర సంవత్సరాలు దాటినప్పటికీ వారికి ఇండ్ల పట్టాలు జారీ చేయలేదని అటువంటి నిరుపేదలందరికీ పట్టాలను ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అదేవిధంగా స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రంగా మారుస్తామని హామీ ఇవ్వడం జరిగిందని. ఆ హామీని నిలబెట్టుకోవాలని వారు అన్నారు. అందువల్ల ప్రభుత్వానికి ప్రజల సమస్యలను తెలియజేయడం కోసం జరిగే జూలై 1న ధర్నాలను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం. సుధాకర్, ఆర్.ఎస్.పి నాయకులు నరేష్, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్, వామపక్షాల నాయకులు నల్లాల. నర్సయ్య, రాధాకుమార్, గోపాల్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.



## యూత్ భవన నిర్మాణ నిధుల కొరకు ప్రభుత్వ విప్ కు వినతి

**రుద్రంగి జూన్ 29 (జనం సాక్షి)**
రుద్రంగి మండల కేంద్రంలో గల చైతన్య యూత్ భవన నిర్మాణం కొరకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసులు సోమవారం యూత్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, ఎర్రం నరసయ్య, అంగాల మల్లేశం, చేలుకల శ్రీనివాస్, శ్రీరాముల రాజా నరసయ్య, చేలుకల గంగాధర్, అట్టే పెల్లి మల్లేశం, ఇప్ప నరేష్, కంటే నరసయ్య, ఎర్రం చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రీ ప్రైమరీ తరగతులను పరిశీలించిన రాష్ట్ర పరిశీలక బృందం

సిరిసిల్ల టౌన్ జూన్ 29 (జనం సాక్షి)
సోమవారం నెహ్రూ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రీ -ప్రైమరీ తరగతుల రాష్ట్రప్రత్యేక పరిశీలనాధికారి ఉష పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులతో ముచ్చటించి ఆనందం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ గుర్తింపు పొందినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ పద్మజా, మండల విద్యాధికారి దూసరఘుపతి, ఉపాధ్యాయులు నందిని,లావణ్య,కరుణ,రూప తదితరులు పాల్గొన్నారు.



## గంగామాత వార్షికోత్సవానికి హాజరైన చల్మెడ



**పుత్రంగి జూన్ 29 (జనం సాక్షి)**
రుద్రంగి మండల కేంద్రంలో గంగపుత్రులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గంగా మాత వార్షికోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగపుత్ర సంఘం సభ్యులు చల్మెడ ను శాలువాతో సత్కరించి సన్మానించారు.గంగపుత్ర కుల బాంధవులతో కలిసి నెత్తిన బోనం ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లారు. వారి వెంట సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం,మాజీ ఎంపీపీ గంగం స్వరూప మహేష్,గంగపుత్ర సంఘం అధ్యక్షులు దేశవేణి దర్మేష్,వార్డు సభ్యులు చెప్యాల శిరీష గణేష్, ఉప్పులుటి గణేష్, నాయకులు చిట్టాపురం నర్సయ్య, గాజే నరేష్, రాజేష్, గడ్డం మహేందర్, సింగారపు గంగాధర్, గంగరాజం, నాగులపల్లి రవి, ఏనుగుల రాజు, గంగం రాజిరెడ్డి, బోయిని చంద్రయ్య, గసికంటి కొండయ్య, దయ్యాలా పెద్దులు, బొడ్డు మల్లయ్య, లంకదాసరి మణిదీప్, కాదాసు లక్ష్మణ్, కట్కూరి శంకర్, నగేష్, చిట్టాపురం గణేష్, గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## బోధన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, గ్యాస్ ఐరన్ బాక్స్‌ల పంపిణీ

**బోధన్, జూన్ 29 ( జనంసాక్షి ) :**
రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో కుట్టు మిషన్లు మరియు గ్యాస్ ఐరన్ బాక్స్‌లను సోమవారం బోధన్ ఆర్డీవో విజయ కుమారి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోధన్ ఆర్డీవో విజయ కుమారి, బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి హాజరై లబ్ధిదారులకు 6 కుట్టు మిషన్లు మరియు 4 గ్యాస్ ఐరన్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో విజయ కుమారి మాట్లాడుతూ, లబ్ధిదారులు అందుకున్న కుట్టు మిషన్లు, గ్యాస్ ఐరన్ బాక్స్‌లను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి మాట్లాడుతూ, సమాజంలోని అవసరమైన వారికి చేయూతనిచ్చే రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ అధ్యక్షులు ఓంకార్ శ్రీనివాస్ రాజు, కార్యదర్శి అల్లే రమేష్, కోశాధికారి తూము రవీందర్ రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ సభ్యులు, లబ్ధిదారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ



రామగిరి, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో సింగరేణి కాంట్రాక్టర్ చిలువేరు వెంకటేశం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్లేట్స్, 40 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలువేరు వెంకటేశం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. ఈశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని, చిలువేరు వెంకటేశం అందించిన విద్యా సామగ్రి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సతీష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఆర్ఆర్ అటనామస్ కళాశాల డిగ్రీ ఆరవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

### 78 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థుల ఘనత

**కరీంనగర్ టౌన్, జూన్ 29 ( జనం సాక్షి)**
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటనామస్ కళాశాల డిగ్రీ ఆరవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మరియు అధ్యాపకుల బృందం కలిసి ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణ అధికారి సంయుక్తంగా మాట్లాడుతూ, ప్రస్తుత విద్యాసంవత్సరం ఆరవ సెమిస్టర్ పరీక్షలలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల స్వయంప్రతిపత్తి హోదా పొందిన తర్వాత, ఇక్కడి నుండి విజయవంతంగా విద్యాభ్యాసం పూర్తి చేసుకుని పోటీ ప్రపంచంలోకి అడుగుడుతున్న రెండవ బ్యాచ్ విద్యార్థులు వీరే కావడం విశేషమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను వలీజీఎతీజీనిఇష్ట్ర.ఇనీఎ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ నితిన్ పాఠక్, టి. రాజయ్య, టిజిసిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు టి. కరుణాకర్, డాక్టర్ ఎం. మల్లారెడ్డి, అకాడమిక్ సమన్వయకర్తలు డాక్టర్ ఏ. శంకరయ్య, కట్టా వేణు, ఐక్యూఏసి సమన్వయకర్త డాక్టర్ హర్జ్యోత్ కౌర్, అటనామస్ సమన్వయకర్త ఒ స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.




## లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### అధ్యక్షుడిగా మ్యాడం శివకాంత్ పటేల్, కార్యదర్శిగా బట్టు వినోద్ బాధ్యతల స్వీకారం

**కరీంనగర్ టౌన్, జూన్ 29 (జనంసాక్షి):**
లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ 2026?27 లయనిస్టిక్ సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలు నగరంలో అత్యంత ఘనంగా జరిగాయి. క్లబ్ ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖుల సమక్షంలో నూతన సమితి అధికారికంగా బాధ్యతలను స్వీకరించింది. ఈ ప్రతిష్టాత్మక లయనిస్టిక్ సంవత్సరానికి గాను నూతన అధ్యక్షుడిగా లయన్ మ్యాడం శివకాంత్ పటేల్ పిఎంజెఎఫ్, కార్యదర్శిగా లయన్ బట్టు వినోద్, ఖజాంచిగా లయన్ మెతుకు చైతన్యలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు సంయుక్త కార్యదర్శిగా లయన్ ఐత సూరజ్, సంయుక్త ఖజాంచిగా లయన్ కంభం ప్రసాద్ బాధ్యతలు చేపట్టగా, తక్షణ మాజీ అధ్యక్షుడిగా లయన్ ముక్క శరత్ కృష్ణ నూతన కార్యవర్గానికి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లయన్ మ్యాడం శివకాంత్ పటేల్ పిఎంజెఎఫ్ మాట్లాడుతూ.. క్లబ్ సభ్యులందరూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని చెప్పారు. లయన్స్ ఇంటర్నేషనల్ యొక్క మూల సూత్రం వి సర్వ్ అనే ఆశయానికి కట్టుబడి, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో సమాజ సేవను మరింత విస్తృతం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన క్లబ్ సభ్యులు, ఆహ్వానితులు, దాతలు, శ్రేయోభిలాషులందరికీ నూతన కార్యవర్గ సభ్యులు ప్రత్యేకంగా తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలించిన బోధన్ ఆర్డీవో

**బోధన్, జూన్ 29 ( జనంసాక్షి ) :**
బోధన్ పట్టణంలోని బసవతారక నగర్, పాండు తర్ఫా పోలింగ్ స్టేషన్ నెంబర్ 72, 73 లలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను సోమవారం బోధన్ ఆర్డీవో విజయ కుమారి పరిశీలించారు. సర్వేలో పాల్గొన్న బిఎల్వోలు, బిఎల్ఎలతో మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇచ్చిన గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది పని చేస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు.

## బోధన్ మారుతి మందిరంలో సత్యగంగ పున్నమి వేడుకలు



**బోధన్, జూన్ 29 ( జనంసాక్షి ) :**
జేష్ట మాస పౌర్ణమని పురస్కరించుకొని సోమవారం బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరంలో సత్యగంగ పున్నమి సందర్భంగా ప్రత్యేకమై పూజలు నిర్వహించారు. ఈరోజు పౌర్ణిమ విశేషమైనటువంటి రోజును పురస్కరించుకొని సత్తెగంగాపూర్ణిమ మరియు వట వృక్షము అనగా మర్రి వృక్షము, సావిత్రి పున్నమ్మ కూడా అని అంటారని పేద పండితులు శ్రీ ప్రవీణ్ మహారాజు తెలిపారు.
ఈనాటి విశేషత సావిత్రి అయినటువంటి మహా పతివ్రత ఆ తల్లి తన భర్త ప్రాణాల కోసం ఈ యొక్క మహావృక్షం మర్రిచెట్టుని సేవించి మహావిష్ణు స్వరూపమైనటువంటి ఈరోజు ఈ వ్రతం చేయడం ఆనవాయితీ ఇది తరతరాలుగా వస్తున్నటువంటి ఆచారం కనుక ఈ రోజు ప్రత్యేకమైనటువంటి గంగా స్నానము మరియు తెప్ప ఇలాంటి విశేష కార్యక్రమాలు చేస్తే సుఖశాంతులు ప్రాప్తం అవుతాయని పురాణంలో చెప్పడం జరిగిందన్నారు. కనుక ఈరోజు ప్రత్యేకమైనటు వంటి కార్యక్రమాలు నిర్వహించినట్టుగా ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వణాధికారి ఎన్ రాములు నాయకం, భక్తులు పాల్గొన్నారు.

# 26 ఏళ్ల విశిష్ట సేవలకు ఘన సన్మానం

- ◆మార్కెట్ కమిటీలో వాచ్‌మన్ అనుమ లక్ష్మి పదవీ విరమణ
- ◆లక్ష్మి అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలిచారు.
- ◆మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న

**కరీంనగర్ బ్యూరో, జూన్ 29 (జనంసాక్షి) :**
కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో వాచ్‌మన్‌గా సుమారు 26 సంవత్సరాలపాటు నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించిన అనుమ లక్ష్మి - దుర్గయ్య పదవీ విరమణ సందర్భంగా సోమవారం సాయంత్రం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది కలిసి అనుమ లక్ష్మిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. వారి విశిష్ట సేవలను కొనియాడుతూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ మాట్లాడుతూ... అనుమ లక్ష్మి వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ, కర్తవ్యాన్ని దైవంగా భావించి, అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారు. వారి నిజాయితీ, సేవా తత్వం, క్రమశిక్షణ మార్కెట్ కమిటీ సిబ్బందికి ఆదర్శంగా నిలిచాయి. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమే అయినప్పటికీ, ఆమె అందించిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయి. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. అనంతరం ఉద్యోగ జీవితంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సహోద్యోగులు ఆమె సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సహోద్యోగులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అనుమ లక్ష్మికి ఘనంగా వీడ్కోలు పలికారు. వారి భావి జీవితం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం, సుఖశాంతులతో నిండిపోవాలని ఆకాంక్షించారు.



# గుప్పెడు గుండెకు..సింగరేణి గట్టి భరోసా..




**- గోదావరిఖనిలో తొలి క్యాథ్ ల్యాబ్..**

**- కోల్ బెల్ట్ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు..**

**- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఏడాదిలోనే ఏర్పాటైన క్యాథ్ ల్యాబ్..**

**- యేటా రూ.6కోట్ల వ్యయం అయ్యే అవకాశం..**

**- గుండె జబ్బు అత్యవసర చికిత్స ఇక స్థానికంగానే..**

**- వేలాది ప్రాణాలకు భరోసా..**

**- కార్మిక కుటుంబాల సంక్షేమం దిశగా సింగరేణి మరో ముందడుగు..**

**గోదావరిఖని, జనంసాక్షి:**
దేశానికి వెలుగులు పంచే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థకు గుండెకాయగా ఉన్న కార్మికుల హృదయాలకు గట్టి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను రామగుండం-1 ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది.త్వరలో లాంఛనంగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది.సింగరేణి కార్మికులకు అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల నేపథ్యంలో సింగరేణి ఉద్యోగులు ఎక్కువగా నివసించే (దాదాపు 33 వేల మంది) గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి సంస్థ తొలి క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం.దీంతో పెద్దపల్లి, మంచిర్యాల, కొమురం భీమ్ ఆసిఫాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో నివసిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణి ఉద్యోగులతోపాటు సమీప గ్రామాల ప్రజల హృదయాలకు సింగరేణి గట్టి భరోసాను ఇచ్చినట్లు అయింది.

**క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు ఎందుకు..**
గుండె సమస్య అన్నది నేడు వయో భేదం లేకుండా ప్రతీ ఒక్కరూ ఎదుర్కొంటున్న అతి ప్రాణాంతక జబ్బు.ఇది ఎప్పుడు వస్తుందో అంచనా వేయడం కష్టమే కానీ,ఈ సమస్య తలెత్తిన తొలి గంట అత్యంత కీలకమని వైద్యులు పేర్కొంటారు.దీన్ని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు.ఈ సమయంలో సత్వరమే చికిత్స అందించగలిగితే విలువైన ప్రాణాలను కాపాడవచ్చు. అయితే సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కంపెనీ ఆధ్వర్యంలో అనేక ఆధునిక వైద్య సౌకర్యాలు గల ఏరియా ఆసుపత్రులు ఉన్నప్పటికీ అందులో కార్డియాక్ సంబంధిత సేవలు పరిమిత స్థాయిలో ఉన్నాయి.ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన రోగులను హైదరాబాద్,కరీంనగర్, వరంగల్ వంటి సుదూర నగరాలకు తరలించాల్సి వచ్చేది. ఆ సుదీర్ఘ ప్రయాణంలో అమూల్యమైన 'గోల్డెన్ అవర్' (రక్షించదగిన తొలి గంట) వృథా అవుతుండేది. ఈ నేపథ్యంలోనే గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ను సింగరేణి ఏర్పాటు చేసింది.
ప్రాణాలను కాపాడే 'గోల్డెన్ అవర్' వైద్యం:గుండెపోటు వచ్చిన తొలి గంట అత్యంత కీలకం.అదే సమయంలో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందితే రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి.ఈ అత్యవసర సేవల ప్రాధాన్యతను గుర్తించిన సింగరేణి యాజమాన్యం, అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అత్యాధునిక సాంకేతికతతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. బొగ్గు బెల్ట్ ప్రజలకు సకాలంలో, తక్కువ వ్యవధిలోనే అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

**కార్మికుడి ఆరోగ్యమే సంస్థ సంపద:**
కార్మికుల ఆరోగ్యం కోసం సింగరేణి సంస్థ ఏటా 300 కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల రెఫరల్స్ కోసమే అధిక మొత్తం నిధులను కేటాయిస్తోంది. గత ఏడాది మాత్రమే హృద్రోగ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సుమారు 3,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి, బెల్లంపల్లి, రామగుండం, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగింది. అయితే గుండె జబ్బుల విషయంలో ప్రతీ నిమిషయం విలువైనదే కావడంతో లక్షల రూపాయలు వెచ్చించడం కంటే సకాలంలో అత్యాధునిక చికిత్స అందించడం ద్వారానే ప్రాణాలను కాపాడవచ్చనే దృఢ సంకల్పంతో సింగరేణి యాజమాన్యం గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మరో మారు కార్మిక సంక్షేమంలో సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఈ ముందడుగు ద్వారా మరోసారి నిరూపించింది.



**ఉత్తర తెలంగాణకు లభించిన వరం:**
గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొత్తం 7890 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగరేణి కార్డియాలజీ విభాగం ఉంటుంది.ఇందులో 5 బెడ్ల సామర్థ్యం గల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్,10 బెడ్ల సామర్థ్యంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ప్రత్యేక గదులతో ఔట్ పేషెంట్ బ్లాక్ ఉంటాయి.గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, పెద్దపల్లి, భూపాలపల్లి, మంథని తదితర పరిసర ప్రాంతాలతో పాటు మొత్తం కోల్ బెల్ట్ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలకు ఈ క్యాథ్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుంది. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్ కోసం ఏడేళ్లలో సింగరేణి సంస్థ దాదాపు 50 కోట్ల ఖర్చును భరించనుంది. అలాగే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ టారిఫ్‌ల మేరకు అతి తక్కువ ఖర్చుతో స్థానికులకు కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించే సౌకర్యాన్ని కల్పించింది. ప్రతీ నెల దాదాపు 3 వేల మందికి పైగా ఈ సేవలను వినియోగించుకుంటారని అంచనా. అయితే ఇక్కడ క్యాథ్ ల్యాబ్ ఉన్న బెడ్ల సామర్థ్యంలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణీయులకు రిజర్వు చేయడం జరుగుతుంది.



**గోదావరిఖని క్యాథ్ ల్యాబ్‌లో సేవలు:**
ఈ క్యాథ్ ల్యాబ్‌లో గుండెకు సంబంధించిన అత్యాధునిక పరీక్షలు..చికిత్సలు అందుబాటులో ఉంటాయి..రక్తనాళాల పరీక్షలు: గుండె నరాల్లో బ్లాక్‌లను గుర్తించే పరీక్షలు.యాంజియోగ్రామ్ యాంజియోప్లాస్టీ గుండెపోటు తీవ్రతను అంచనా వేసి, తక్షణ ఉపశమనం కలిగించే చికిత్సలు.స్టెంట్ అమరిక ప్రాణాపాయం నుండి రక్షించే స్టెంటింగ్ ప్రక్రియలు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ: అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య సిబ్బందితో నిరంతర సేవలు.స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం ద్వారా విలువైన ప్రాణాలకు భరోసా కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ క్యాథ్ ల్యాబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.ఇక సుదూర ప్రాంతాలకు తరలించకుండా,ఇకపై గోల్డెన్ అవర్‌లోనే అత్యవసర చికిత్స అందించడం ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడే కేంద్రంగా గోదావరిఖని క్యాథ్ ల్యాబ్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు.



## సింగరేణి యాజమాన్య మౌత్ పీసులుగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు..

## - టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి..




గోదావరిఖని, జనంసాక్షి:
సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్య మౌత్ పీసులుగా మారారని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు.యాజమాన్యం చెప్పాల్సిన సమాధానాలను సైతం వారి తరపున వకాల్తా పుచ్చుకొని తామే చెప్తున్నారని ఎద్దేవా చేశారు.గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి తో కలిసి ఆయన మాట్లాడుతూ కార్మికులకు సరైన పనిముట్లు, కనీసం తాగడానికి స్వచ్ఛమైన నీరు లేకపోయినా, వైద్యం అందక పోయినా మాట్లాడని గుర్తింపు సంఘం,సింగరేణిలో జరుగుతున్న వేల కోట్ల రూపాయల అవినీతిని ప్రశ్నించని గుర్తింపు సంఘం..యాజమాన్యానికి వత్తాసు పలుకడం సిగ్గుచేటన్నారు. బొగ్గు మాయమని, అమ్ముకున్నారని, అక్రమ రవాణా జరిగిందని తాము ఆరోపించడం లేదని,సంస్థ వెబ్ సైట్‌లో చూపిన 40లక్షల టన్నుల బొగ్గునిల్వలు ఎక్కడున్నాయో చూపమని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉత్పత్తికాని బొగ్గును ఎక్కువగా చూపడం మూలంగా సంస్థకు, కార్మికులకు వందల కోట్ల నష్టం జరుగుతోందని పేర్కొన్నారు.లేని ఉత్పత్తిని చూపడం కారణంగా, ఇన్కమ్ టాక్స్,సెస్, రాయల్టీ, కాంట్రాక్టర్లకు అదనపు చెల్లింపుల మూలంగా జరుగుతున్న నష్టంపై అడిగితే తప్పా అని ప్రశ్నించారు.జాతీయ సంఘాలు ప్రభుత్వానికి, యాజమాన్యానికి తొత్తులుగా మారి వత్తాసు పలుకడం మానుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, జాహెద్‌పాషా, చెల్పూరి సతీష్, పోలాడి శ్రీనివాస్,చల్ల రవీందర్‌రెడ్డి, ఇందూరి సత్యనారాయణ,మదనపల్లి రాజేశం, వాసర్ల జోసెఫ్, పల్లె సురేందర్, పులిపాక శంకర్, రోడ్డ సంపత్, అప్సర్‌పాష, ఉప్పులేటి తిరుపతి, అడ్డగట్ల గోపి,నూతి రాజ్‌కుమార్, దండె రవి, తదితరులు పాల్గొన్నారు.

## హరితోద్యమం, ఫాదర్స్-డే వేడుకలు..

**గోదావరిఖని, జనంసాక్షి:**
స్థానిక సప్తగిరికాలనీలో ఓ ప్రైవేటు స్కూల్‌లో హరితోద్యమం, ఫాదర్స్-డే కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి హరితోద్యమానికి శ్రీకారం చుట్టారు.అనంతరం నిర్వహించిన ఫాదర్స్ డే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.చెట్లు మన జీవనాధారమని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే హరితోద్యమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని అన్నారు.అనంతరం ఫాదర్స్-డే ప్రాముఖ్యతను వివరిస్తూ, పిల్లల



ఎదుగుదలలో తండ్రి పాత్ర ఎంతో కీలకమని, తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి బిడ్డ బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థులు కుటుంబ విలువలను అలవర్చుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తడగొండ నరసయ్య, బియ్యాల మహేందర్, రామగుండం బ్రాంచ్ ఏజీఎం అరవిందరెడ్డి, ప్రిన్సిపాల్ శివకీర్తి,అనిల్‌కుమార్, స్వప్న, పూజ, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.